batukammanews.com
TEL/2019/78873

బతుకమ్మ

1 నవంబర్ 2026
ఆదివారం

తాజా వార్తల సద్దిమూట

దంపతులపై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

ఆటో చోరి కేసు వెలుగులోకి..

చోరి చేసిన ఆటోలో వెళ్తూ మెల్లిగా వెళ్లమన్నందుకు బైక్ పై వెళ్తున్న దంపతులపై దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరి చేసిన ఆటోతో పాటు రాడ్ ను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ 1వ టౌన్ ఎస్ హెచ్ వో శ్రీనివాస్ తెలిపారు.

– నిజామాబాద్ క్రైం, బతుకమ్మ

2 లో





ఒక వైపు వేట...

- దూకుడు పెంచిన సీఐడి
- డీసీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి అదుపులో..
- రైస్ మిల్ యజమాని కిషోర్ ఇనాని అరెస్ట్

మరో వైపు విచారణ..!

2 లో

రాష్ట్రంలో వెలుగు చూసిన సన్న వడ్లు తీసుకొని ఎఫ్సిఐకి దొడ్డు బియ్యం అంటగాట్టిన కుంభకోణం పై సీఐడి దూకుడు పెంచింది. డీసీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి తో పాటు బోధన్ కు చెందిన ప్రముఖ విద్యా రైస్ మిల్ యజమాని కిషోర్ ఇనానిని సిఐడి అధికారులు శనివారం అరెస్టు చేశారు.ఈ కేసులో 16 మంది మిల్లర్ల కు గాను 14 మంది ని అరెస్ట్ చేయగా ఇద్దరు పరార్ అయినా విషయం విధితమే. ఇద్దరు మిల్లర్లు కోర్ట్ ను ఆశ్రయించి బెయిల్ పొందినట్టు తెలిసింది. రిమాండ్ లో ఉన్న 14 మందిని విచారణ కు సీఐడి కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా కోర్ట్ అనుమతించింది. మిల్లర్ లను శుక్రవారం కస్టడీ తీసుకున్న అధికారులు ఆదివారం వరకు విచారించనున్నారు.ఇదిలా ఉండగా కొన్ని రైస్ మిల్లు లలో భాగస్వాములు ఇప్పటికి పరారీలో ఉండగా వారి కోసం సీఐడి వేట మొదలు పెట్టింది. వారి కోసం గాలింపు చేపట్టింది.

– నిజామాబాద్, బతుకమ్మ

ఎల్‌నినో నేపథ్యంలో
నీటి పొదుపునకు పిలుపు

‘ దిశా’ సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్

ఆర్ఓబీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశం

అందుబాటులో ఉన్న నీటి వనరులను తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం: కలెక్టర్ వెల్లడి

ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే మాధవనగర్, అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయించాలని, రానున్న నాలుగైదు నెలల్లో వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

– నిజామాబాద్, బతుకమ్మ

2 లో



మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూస్తున్న కాంగ్రెస్

- నాలుగేళ్లుగా అర్సపల్లి ఆర్ఓబికి భూ సేకరణ జరుపలేదు. . .
- బోధన్‌లో నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి కట్టలేమని సుదర్శన్ రెడ్డి చేతులెత్తేశారు. . .
- పార్లమెంట్సభ్యులు అర్వింద్ ధర్మపురి

2 లో



చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ

108 మంది విద్యార్థులకు డ్రగ్స్ టెస్టులు, ముగ్గురికి పాజిటివ్!

6 లో

మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూస్తున్న కాంగ్రెస్



నిజామాబాద్, బతుకమ్మ: పని చేస్తున్నం మాకు ఓట్లు వేయమని ముస్లింలను అడుగుతున్నాం. కానీ మైనార్టీలకుకాంగ్రెస్ అంటేనే ప్రేమ. వారికి మాత్రం అడగకుండానే ఓట్లు వేస్తున్నారు. వారు ఓట్లువేయరు అని తెలిసిన మైనార్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాం. కాంగ్రెస్పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తుందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మితమవుతున్న అర్సపల్లి ఆర్ఓబి నిర్మాణపనులను శనివారం ఎంపీ అర్వింద్ ధర్మపురి అధికారులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్పార్టీకి ముస్లింలపై ప్రేమ లేదని కేంద్ర ప్రభుత్వం నిధుల తో నిర్మిస్తున్న అర్సపల్లి ఆర్ ఓబి పనులునిదర్శనం అన్నారు. కేంద్రం 127 కోట్లు కేటాయించి పనులు చేస్తుంటే, రాష్ట్రప్రభుత్వం కేవలం భూసేకరణ కోసం రూ.10 కోట్లు కేటాయించడానికి మనసు ఓప్ప లేదనిఅన్నారు. తాను ఇటీవల ఆర్ ఓ బిల కోసం దీక్ష చేసిన భిక్షాటన చేస్తే రాష్ట్ర ప్రభుత్వందిగి వచ్చి మాధవ నగర్ కు నిధులు విడుదల చేస్తామని చెప్పిందన్నారు. ఇక అర్సపల్లిఆర్ ఓ బి కోసం భూసేకరణ నిధులు విడుదల చేస్తుందని ఆర్ అండ్ బి అధికారులుచెబుతున్నారు. అర్సపల్లి ఆర్ ఓ బి నిర్మాణం కారణంగా రైల్వే ట్రాఫిక్ కెబుల్స్మార్పిడి కోసం కేవలం రూ.60 లక్షల విడుదలకు లేఖ రాయలేని దుస్థితిలో ఉన్నారని ఎంపిఅరవింద్ అన్నారు. నిజామాబాద్ అర్బన్ లో ముస్లింలు బిజెపి ఓటు వేయలేదని గతంలోగణేష్ గుప్తాకు, మొన్న కాంగ్రెస్ అభ్యర్థికి వేసిన తాను మాత్రం మోడితో కోట్లాడిరూ.127 కోట్లతో అర్సపల్లి ఆర్ ఓ బి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తనకు పేరుఅక్కర్లేదని కావాలంటే పేపర్ పైరాసిస్తానని ఎంపి అర్వింద్ అన్నారు. బోధన్ లో ఆర్ఓబి కోసం గత ప్రభుత్వం నిర్మాణంచేసిన సాంక్షన్ కాలేదు, తాను చేసిన వినతికి స్పందించిన కేంద్రం రూ.90 కోట్లతోనిర్మాణంకు 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు పీఎం మోడి పర్చువల్ పద్ధతిలో పనులనుప్రారంభించారు అని గుర్తు చేశారు. బోధన్ లో పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్తు అవసరాలకారణంగా మాధవ నగర్, అర్సపల్లి మాదిరిగా ఫోర్ లైన్ల బ్రిడ్జి నిర్మాణానికిప్రతిపాదనలు చేశానని తెలిపారు. కానీ బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ ప్రధాన సలహాదారుబోధన్ కు నాలుగు లేన్ల ఆర్ ఓ బి అక్కర్లేదని, రెండు లైన్ల నిర్మాణం చేస్తే చాలనిప్రభుత్వం వద్ద పైసలు లేవని చేతులెత్తేశారు అని ఎంపి అరవింద్ ఆరోపించారు. నిజామాబాద్ ట్రాఫిక్అవసరాలు, ఫ్యూచర్ కారణంగా మాధవ నగర్ ఆర్ఓబిని నాలుగు లేన్లు గా మార్చానని, బోధన్కు భూసేకరణ అక్కర్లేదని కేవలం రూ.90 కోట్లు ఇస్తే ఫోర్ లైన్ ల బ్రిడ్జి అంటేసుదర్శన్ రెడ్డి కి ఇష్టం లేదని, బోధన్ లో మెజారిటీగా ఉన్న మైనార్టీల అంటే ప్రేమనేలేదని విమర్శించారు. తాను స్పందించి దీక్ష చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెళ్ల తరబడి పెండింగ్లోఉన్న భూసేకరణ సమస్య రెండు రోజుల క్రితం పరిష్కారమైందని అధికారులు తెలియజేశారు.ఇకనైనా మిగిలిన ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లనుఆదేశించారు. ఎంపితో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ , జాతీయ పసుపు చైర్మన్ పల్లె గంగారెడ్డి , రాష్ట్రకార్యదర్శి స్రవంతి రెడ్డి , జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి రైల్వే డి ఆర్ యూసిసి సభ్యులు సురేష్ బాబు, ఆర్ అండ్ బి, రైల్వేఅధికారులు,భారతీయ జనతా పార్టీ నాయకులుఉన్నారు

ఎల్నినో నేపథ్యంలో నీటి పొదుపునకు పిలుపు





సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. అంతకుముందు గత సమావేశంలో చేసిన తీర్మానాలపై చేపట్టిన చర్యల గురించి అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ప్రజల్లో, రైతులలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కాగా, మోదవనగర్, అర్సపల్లి ఆర్.ఓ.బీల నిర్మాణాలలో ఎనలేని తాత్సారం జరుగుతోందని ఎం.పీ సంబంధిత అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్దిరామంగా పనులు జరిపిస్తూ నాలుగైదు నెలలలో పూర్తి చేయించాలని, మరోమారు గడువు పొడిగింపుకు ఉండకూడదని ఆర్ అండ్ బీ, రైల్వే అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మెరుగుదల పనులను, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుండి కేటాయించబడిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రజోపయోగ పనులు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నిధులను విద్యార్థులకు అందించారా అని ఎం.పీ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో నేరుగా ఉపకార వేతనాలను జమ చేయించామని సంక్షేమ శాఖల అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. కాగా, డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలకు జిల్లా యంత్రాంగం చొరవతో ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాను వేదికగా ఎంపిక చేయడం పట్ల ఎం.పీ అర్వింద్ హర్షం వెలిబుచ్చారు. క్రీడా పోటీల విజయవంతానికి, జిల్లాలో క్రీడా సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి పూర్తి స్థాయిలో సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎల్ నినో ప్రభావం గురించి వివరిస్తూ, అధికార యంత్రాంగం తరపున చేపడుతున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. అదృష్టవశాత్తు ఖరీఫ్ సీజన్ లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో జిల్లా రైతాంగం గట్టెక్కగలిగారని అన్నారు. అయితే ప్రస్తుతం యాసంగిలో మాత్రం పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదని, ఈ మేరకు ప్రభుత్వం కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. వర్షాభావం, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని 18 మండలాలలో సాధారణ కరువు నెలకొని ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రబీలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, పప్పు దినుసులు వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు రాయితీపై పంటల విత్తనాలు అందిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో వీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్, జూలై మాసాల వరకు కూడా వర్షాలు కురిసే పరిస్థితి లేనందున ప్రస్తుతం జలాశయాల్లో నిలువ ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇదే సమయానికి 80 టీ.ఎం.సీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 35 టీ.ఎం.సీలకే పరిమితం అయ్యిందన్నారు. అదేవిధంగా నిజాంసాగర్ రిజర్వాయర్ లోనూ గతేడాది 17 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 9 టీ.ఎం.సీలు మాత్రమే ఉందన్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టం సైతం వేగంగా పడిపోతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక వైపు వేట...మరో వైపు విచారణ

సిఐడి కస్టడీలో మిల్లర్లు ఇచ్చిన సమాచారం మేరకు ప్రముఖ రైస్ మిల్లర్ కిషోర్ ఇనాని అరెస్ట్ చేయడం కలకలం రేపింది. సన్న వడ్లు తీసుకొని దొడ్డు బియ్యం సరఫరాలో పాత్ర ఉన్న జిల్లా పౌర సరఫరా ల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఉత్తర్వులు జారీ చేసారు.రాష్ట్రం లో 16 రైస్ మిల్లులు 242 కోట్ల విలువైన సన్న బియ్యం భారత ఆహార సంస్థ కు అప్పగించే విషయంలో ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ ఫిర్యాదు మేరకు నిజామాబాద్, కరీంనగర్, ములుగుకు చెందిన 16 రైసుమిల్లు లపై సీఐడి కేసులు నమోదు చేసి 14 మంది మిల్లర్ లను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అందులో కేవలం నిజామాబాద్ జిల్లా కు చెందిన 6 రైస్ మిల్లు లు ఉన్నాయి. అందులో నలుగురు మిల్లర్ యజమానులు అరెస్ట్ చేయగా వారి పార్టనర్ లు ఎస్కెప్ అయ్యారు. సీఐడి కి చిక్కకుండ పారి పోయిన వారి కోసం సీఐడి డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. 242 కోట్ల సన్నవడ్లు తీసుకుని దొడ్డుబియ్యం అంటగట్టిన కుంభకోణంలో మూడు జిల్లాలో నిజామాబాద్ నుంచే సింహాభాగం అక్రమాలు జరిగినట్లు సీఐడి గుర్తించింది. ఇప్పటికే ఆరు రైసుమిల్లులపై కేసు నమోదు చేసి సిఐడి అందులో భాగస్వాములుగా ఉన్న మరికొంత మందిని పట్టుకునేందుకు వేట మొదలుపెట్టింది. అందులో ఒకరిని అదుపులోకి తీసుకుని రాత్రి అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.తాజాగా దొడ్డుబియ్యంను సన్నబియ్యంగా సర్టిపై చేసిన పౌర సరఫరాల అధికారులను విచారణ చేయాలని సిఐడి అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది.సివిల్ సప్లయ్ జనరల్ మేనేజర్ ఫిర్యాదులు, సిఐడి కేసుల నమోదుకు ముందు నుంచి జిల్లా డీసీఎస్ఓ సెలవులో ఉన్నట్లు తెలిసింది. శనివారం జిల్లా పౌర సరఫరా ల శాఖధికారి శ్రీకాంత్ రెడ్డి ని సీఐ డి అధికారులు నిజామాబాద్ రప్పించారు. రాత్రి వైద్య పరీక్షల అనంతరం అరెస్ట్ చేసినట్లు తెలిసింది. డీసీఎస్ఓను కోర్ట్ ద్వారా కస్టడీ కోరి విచారించను శీడడంతో సర్టిపై వ్యవహరంలో అధికారులకు అందిన అమ్యామ్యాలతో పాటు అసలు వడ్ల పక్కదారితో పాటు సన్నబియ్యం స్థానంలో దొడ్డుబియ్యం ఏ విధంగా ఎఫ్ సిఐకి అంటగట్టిన వ్యవహరం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయంలోనూ అధికారులపై కేసులు నమోదు కావడంతో పాటు విచారణ జరుగుతుందని టాక్ నడుస్తోంది.

దంపతులపై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

మోపాల మండలం మంచిప్ప గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజుపై మెట్ పల్లి, కరీంనగర్, కమ్మర్ పల్లి, గంగాధర,కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, కామారెడ్డి, ఆర్మూర్, మోపాల్, నిజామాబాద్ 1వ టౌన్ పోలీస్ స్టేషన్ లో వాహనాల దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిజన వాడకు చెందిన రామాంజ విష్ణు ఆలియాస్ శంషాబాద్ విష్ణు పై నిజా మాబాద్ 1వ టౌన్, రాజన్నసిరిసిల్లా జిల్లా ముస్తాబాద్, నిజామాబాద్ రూరల్, 4వ టౌన్, సదాశివనగర్ పోలీస్ స్టేషన్ లలో చోరి కేసులలో నిందితులుగా ఉన్నారు. నిజామాబాద్ 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్మరి రాజు, శంషాబాద్ విష్ణులు ఆటోను చోరి చేసి పరారీలో ఉన్నారు. ఇటీవల నగరంలోని అంగడిబజార్ లో గల చాపల మార్కెట్ వద్ద ఇద్దరు దంపతులు బైక్ పై వెళుతుండగా ఆటోలో ఉన్న రాజు, విష్ణుల ను మెల్లగా వెళ్లాలని అన్నందుకు వారిపై రాడ్ తో దాడి చేసి గాయ పర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారి స్తుండగా శనివారం రాజు, విష్ణులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆటో, ఇనుప రాడ్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ హెచ్ వో తెలిపారు.

పటేల్ విగ్రహానికి నివాళ్లర్పించిన ఎంపీ అర్వింద్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భారత ఉక్కు మనిషి, దేశ సమైక్యతా రూపశిల్పి, మాజీ ఉప ప్రధానమంత్రి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (రాష్ట్రీయ ఏకతా దివస్) సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ నివాళ్లర్పించారు. వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వర్ని చౌరస్తాలో గల విగ్రహానికి ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాన్సువాడలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



బాన్సువాడ, బతుకమ్మ : విధి నిర్వహణలో ప్రాణా లర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ బాన్సువాడ పట్టణంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్పీ వితల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టా రు.ఎ ట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో కొవ్వొ త్తులు పట్టుకుని అమరవీరుల సేవలను స్మరిస్తూ ర్యాలీగా ముందుకు సాగారు.దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగాలు చేసిన పోలీసుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకు న్నారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్లో డీజీపీ సివి ఆనంద్ ఆధ్వర్యంలో భారీ



రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు పలు ప్రాంతాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు చేపడుతున్నారు.పోలీసుల సేవలు, విధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పోలీసు శాఖ పేర్కొంది. బాన్సువాడలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ పోలీసు అమరవీరులకు ఘనమైన నివాళిగా నిలిచింది.

కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : రాష్ట్రీయ ఏక్తా దివస్ ను పురస్కరించుకుని శనివారం సమీక్షిత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, అధికారులు, సిబ్బందిచే జిల్లా రెవెన్యూ అధికారిణి గీత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తానని, తోటి వారందరిలో ఈ భావనను



పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత



భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును కాలరాసే సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో మౌన నిరసన

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక రైల్వే స్టేషన్ చౌరస్తాలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ఓటు హక్కును హరించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటి ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న సర్ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి, భారత రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా కొనసాగుతోందని



విమర్శించారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయనే కారణాలు చూపుతూ లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని అన్నారు. ఎన్నికల జాబితాలను సరిదిద్దే పేరుతో ప్రజల ఓటు హక్కును హరించడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. 2002 నాటి పాత సాఫ్ట్‌వేర్‌లో నమోదైన పేర్లు, ఇంటి పేర్లలో ఉన్న స్పెల్లింగ్ పొరపాట్లను సాకుగా చూపుతూ ఓటర్లకు నోటీసులు జారీ చేయడం, తాతలు--ముత్తాతల గుర్తింపు పత్రాలు సమర్పించాలని కోరడం సాధారణ ప్రజలను అనవసర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అనుభవజ్ఞులైన బూత్ లెవల్ అధికారుల స్థానంలో సరైన సాంకేతిక పరిజ్ఞానం లేని సిబ్బందితో సర్ ప్రక్రియ నిర్వహించడం వల్ల అనేక తప్పిదాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడితే అది భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన పరిణామమవుతుందని అన్నారు. ప్రజల ఓటు హక్కును రక్షించాల్సిన ఎన్నికల సంఘమే ప్రజలలో భయాందోళనలు సృష్టించడం సమంజసం కాదన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, కుశాల్,కిషోర్,రంజిత్, సన్ని,నిరాజ్, నగేష్, విష్ణు, భాను తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యత





పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో ఒక భాగమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో 250 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హాజరై అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. పోలీస్ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతపై ఆర్థిక భారం పడకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే సంకల్పంతో ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ 60 రోజుల శిక్షణను అభ్యర్థులు ఒక విలువైన అవకాశంగా భావించి , ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యరని , అధ్యాపకులు అందించే సూచనలు పాటిస్తూ కష్టపడి చదవడంతో పాటు , నేర్చుకున్న అంశాలను ప్రతిరోజూ పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. తమలోని బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ , పట్టుదల , నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధించవచ్చని అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ , సబ్-ఇన్స్పెక్టర్ తదితర ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ , సరైన మార్గదర్శకత్వం అందించి , పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, ఈ ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగనుంది. హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సమగ్ర మార్గదర్శకత్వం శిక్షణలో భాగంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ప్రశ్నలను వేగంగా , కచ్చితంగా పరిష్కరించే విధానం , సమయపాలన, పరీక్షా సరళి , ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి తదితర విషయాల్లో నిపుణులచే మార్గదర్శకత్వం అందిస్తున్నారు. అంతేకాకుండా అభ్యర్థుల్లో పోటీ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు నిరంతర సాధన ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. క్రమశిక్షణ , పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్ సీటీసీ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, రాజశేఖర్ , అధ్యాపక బృందం, శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలుకు చర్యలు

డీఆర్వోను కలిసిన నిజామాబాద్ ఉద్యోగుల సమైక్య నాయకులు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రమోషన్లలో రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు అయ్యే విధంగా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారిని గీత నిజామాబాద్ ఉద్యోగుల సమైక్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలి సారు. శనివారం కలెక్టరేట్ లో ఉద్యోగుల సమైక్య నాయకులు డీఆ ర్వోకు రిప్రజెంటేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కోర్ కమిటీ సభ్యులు నాంపల్లి, జాతీయ ఉపాధ్యక్షులు సురేష్, రాష్ట్ర ఆర్గనై జింగ్ సెక్రటరీ మారుతి, నిజామాబాద్ జిల్లా మాదిగ ఉద్యోగుల సమా ఖ్య అధ్యక్షుడు సైదు,లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఇందూరు శ్రీనివాస్,కోశాధికారి బి. సహదేవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, రిటైర్డ్ ఏపో గంగాధర్ పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతకు పటేల్ విశేష కృషి

నివాళులర్పించిన ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జాతీయ ఐక్యత కోసం కృషి చేసిన మహానుభావులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వర్ని చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 సంస్థానాలను విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమగ్రత ఐక్యతకోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గుజరాత్ లో ప్రపంచంలోనే ఎత్తైన " స్టాచ్యూ ఆఫ్ యూనిటీ " పటేల్ విగ్రహాన్ని నిర్మించి ఘనమైన నివాళి అందించారన్నారు. అలాగే నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి పటేల్ కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ప్రధానంగా 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలో ఆపరేషన్ పోలో ప్రారంభించి, సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు కల్పన అర్చనా చిరంజీవి, జగదీష్ కులకర్ణి, మల్కాయి మహేందర్, మఠం పవన్, న్యాలం సునీత రాజు తదితరులు పాల్గొన్నారు.

చేతబడి అనుమానంతో

తల్లి కూతుళ్ళపై దాడి..

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



రుద్రూర్, బతుకమ్మ : చేతబడి చేస్తుందన్న అనుమానంతో వృద్ధురాలిని రోడ్డుపై చెప్పుతో కొట్టి వీపులో పిడుగులు గుద్ది విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం అంబం (ఆర్) గ్రామానికి చెందిన లోటడి సాయవ్వ, లోటడి శోభ ఇద్దరు తల్లి కూతుర్లు. ముందుగా తల్లి సాయవ్వను ఇరు కుటుంబ సభ్యులు తీవ్రంగా కొడుతున్న క్రమంలో కొట్టొద్దని ప్రాధేయపడినప్పటికీ తనపై సైతం దాడి చేశారంటూ బాధితురాలి కుమార్తె లోటడి శోభ కన్నీరు మున్నీరుగా విలపించింది. ఎందుకు కొడుతున్నారో తెలుసుకునే లోపే తనపై కూడా తీవ్రంగా దాడి చేశారంటూ బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. అనంతరం పోలీసులకు దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల హాజరుపై కమిషనర్ తనిఖీ



ఇందూర్, బతుకమ్మ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ పారిశుధ్య కార్మికుల హాజరును తనిఖీ చేశారు. ఆయన వారి హాజరును ధృవీకరించి, వారు సమయానికి విధులకు హాజరవుతున్నారా, వారికి అప్పగించిన పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా అని పర్యవేక్షించారు. నగరమంతటా పరిశుభ్రతను కాపాడటానికి సమయపాలన, క్రమం తప్పని హాజరు, పారిశుధ్య విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం ప్రాముఖ్యతను కమిషనర్ చెప్పారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కమల్ షా బియాబాని ఉర్సు ఉత్సవాలు



ఇందూర్, బతుకమ్మ : నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల హజ్రత్ కమల్ షా బియాబాని (ఆర్ఏ)లో ఉర్సు ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆల్ హాజ్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ సజ్జద్ నషీన్ ఇంటి నుంచి సందల్ చాదర్ తీసుకుని కంఠేశ్వర్ ప్రాంతంలో ఊరేగించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ ఊరేగింపులో దారి పొడవున భక్తులు దర్శించుకుని భక్తితో ప్రార్థనలలో మునిగిపోయారు. ఊరేగింపు తిరిగి రాత్రి దర్గాకు చేరుకుని సందల్ మాలి చేశారు. అనంతరం సమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ వంశస్తుడు మహ్మద్ అబ్దుల్ అజిజ్ మాట్లాడుతూ ప్రతి యేటా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహ్మద్ ఖాదర్ వంశస్తులు అందరూ కలిసి ఆల్ హాజ్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ను సజ్జద్ నషీద్ గా ప్రకటించారు. ఈ ఉత్సవాల్లో ఖాజామొయినుద్దీన్, జహీర్, హైమద్ ఆలీ, ఎం.ఏ.ఆఫీజ్, మొయిజ్, ఎం.ఏ.ఖదీర్, నసీయొద్దీన్, సమీర్ తదితరులున్నారు.

ఆరుతడి పంటలపై అధికారుల అవగాహన



మాక్లూర్, బతుకమ్మ : మాక్లూర్ మండలంలోని గంగరమంద గ్రామంలో ఖేత్ బచ్చ ఓ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి పద్మ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ నీటి లభ్యత , కరెంటు కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు ,నూనె గింజలు వేసుకోవాలని సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడంతో ఆరతడి పంటలపై గ్రామాల్లోని రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించింది. వరి సాగు చేస్తే నీరు సరిపోక నష్టపోయే ప్రమాదం ఉంది. ఆరుతడి పంటలు వలన పంట మార్పిడి జరిగి భూసారం పెరుగుతుంది.రైతులకు ఉపయోగపడేలా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఇచ్చే ప్రముఖ ఆరుతడి పంటలు సాగు చేయాలి అని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, హార్టికల్చర్ అధికారి సంధ్య, ఆర్మూర్ డివిజన్ చైర్మన్ పాండురంగారావు, సర్పంచ్, కృషి సఖి,అనూష, ఆయిల్ ఫామ్ కంపెనీ ఆఫీసర్, ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖ, రైతులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం పేరుతో భారీ వసూళ్లు

ప్రభుత్వం నుంచి 1.30 కోట్లు నిధులు వచ్చినా ఆగని వసూళ్లు

టీజీవీపీ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలో ప్రైవేట్ విద్యను ఉచితంగా అందిస్తుంటే ఆ స్కీం కింద ఉన్న విజ్ఞాన్ స్కూళ్లో అక్రమంగా వసూళ్ళు చేశారని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ ఆరోపించారు. శనివారం టీజీవీపీ కార్యాలయంలో బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్ యాజమాన్యం 'బెస్ట్ అవైలబుల్' పథకం కింద ప్రభుత్వం నుంచి 2023 నుండి 2026 వరకు మూడేళ్లలో సుమారు 1,29,19,920 రూపాయలు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. కానీ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాలేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా ప్రతి యేడాది రూ. 32,000 చొప్పున వసూలు చేసిందని తెలంగాణ విద్యార్థి పరిషత్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ తెలిపారు. తల్లితండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు సమాచార హక్కు చట్టం ద్వారా మేము తీసుకున్న అధికారిక సమాచారం ప్రకారం యూనిఫాం, బుక్స్ లేదా వసతి కోసం అదనపు ఫీజులు వసూలు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ ఆర్ టిఐ లో స్పష్టం చేసిందన్నారు. అయితే తల్లి తండ్రుల ఫిర్యాదు ప్రకారం 2022 నుండి 2025 వరకు ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు తమకు అందడం లేదని పాఠశాలయాజమన్యం విద్యార్థుల నుండి 32,000 (ధోబీ,ఆహారం,బుక్స్, యూనిఫాం)కోసం అక్రమంగా వసూలు చేసిందని,వసూలు సమయంలో ప్రభుత్వం నుండి నిధులు విడుదల అవగానే తిరిగి చెల్లిస్తామని చెప్పారని, కానీ ఇప్పటి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారన్నారు. అధికారులకు చాలా సార్లు పిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. టీజీవీపీ అడిగిన సమాచారంలో దాదాపు 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులే తెలిపారు. పైగా స్కూల్‌లో ఫైర్ సేఫ్టీ అధికారుల నుండి అనుమతులు కూడా తీసుకోలేదని, కనీస వసతులు లేవని, ఇలాంటి స్కూల్ ని బెస్ట్ స్కూల్ గా అధికారులు ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. అర్హత లేని ఉపాధ్యాయులను నియమించారని, పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు,స్టాఫ్ కి పీఎఫ్ కూడా చెల్లించడం లేదని సమాచార హక్కు చట్టం ప్రకారం తెలిసిందన్నారు. ఇంత వైట్ కలర్ స్కామ్ చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు అని వాపోయారు. వెంటనే యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి బాధిత తల్లి తండ్రులకు న్యాయం చేయాలని, విద్యాశాఖ అధికారి పాఠశాలకు సంబంధించిన అన్ని అర్హతలను మరో మారు పరిశీలించి విచారణ జరపాలని తల్లిదండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ?32,000 తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీజీవీపీ ఆఫీస్ ని సంప్రదించిన తల్లిదండ్రుల తో కలిసి డిఈఓ ఆఫీస్ ముందు ఆందోళన దిగుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అనిరుధ్, రాజ్, కామారెడ్డి ఇంచార్జ్ ,నైతిక్,సాయి,సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘన నివాళ్ళు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భారతదేశ మహిళా ప్రధాని ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ మహనీయుల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆమెను ప్రపంచం మొత్తం "భారత ఉక్కు మహిళ" అని పిలుస్తుంది అని, 1966లో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇందిర, క్లిష్ట సమయాల్లో ధైర్యమైన, విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారన్నారు.దేశంలో ఆహార ధాన్యాల కొరత తీర్చడానికి వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించి భారతదేశాన్ని స్వయంసమృద్ధి వైపు తీసుకెళ్లారన్నారు. అలాగే భారత ఉక్కు మనిషి" స్వర్గీయ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న ఆయన జయంతిని మనం "జాతీయ ఐక్యతా దివస్ గా జరుపుకుంటామన్నారు. చిన్ననాటి నుంచే ఆయన ధైర్యసాహసాలు, పట్టుదల కలిగిన వ్యక్తి. స్వతంత్ర భారత దేశ తొలి ఉప ప్రధానిగా, తొలి హోం మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలు అపారమైనవి అన్నారు.ముఖ్యంగా హైదరాబాద్, జునాగఢ్, కాశ్మీర్ వంటి సంస్థానాలను భారత్‌లో కలిపిన తీరు ఆయన పరిపాలనా దక్షతకు నిదర్శనమన్నారు. గాంధీజీ ప్రారంభించిన బార్డోలీ సత్యాగ్రహంలో రైతులకు నాయకత్వం వహించి విజయం సాధించినందుకే ఆయనకు ప్రజలు "సర్దార్" (నాయకుడు) అనే బిరుదును ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, ఎఐసిసి కో ఆర్డినేటర్ గన్ రాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కౌదపు శరత్, నగర ఉపాధ్యక్షుల అంతరెడ్డి విజయ్ పాల్ రెడ్డి, జిల్లా ఎస్టీ అధ్యక్షులు యాదగిరి, బంటు బలరాం, మహిళ నాయకులు పోలా ఉష,చంద్రకళ, విజయలక్ష్మి, స్వప్న, ఆమరాజు, పోలా శంకర్, ఆదే ప్రవీణ్, తదితరుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులకు ఎల్ఓసీలు అందజేసిన ప్రశాంత్ రెడ్డి





వేల్పూర్, బతుకమ్మ :బాల్కొండ కానిస్టెన్సీ పరిధిలోని రెండు మండలాలకు చెందిన ఇద్దరు అనారోగ్య బాధిత కుటుంబీకులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం ఎల్ ఓ సీలను అందజేశారు. ఇందులో భాగంగా వేల్పూర్ మండలంలోని జానకం పేట్ గ్రామానికి చెందిన గంట స్టాన్లీ అనారోగ్యంతో చికిత్స నిమిత్తం నిమ్స్ లో చేరగా ఆయన చికిత్సకు అయ్యే ఖర్చు రూ. 2,50,000 ఎల్ ఓసీని అందజేశారు. మెండోరా మండలం కేంద్రానికి చెందిన ఎం. డి మహ్మద్ చికిత్స కోసం నిమ్స్ లో చేరగా వైద్యం కోసం అయ్యే ఖర్చు కోసం రూ. 75,000 ఎల్ ఓ సీ చెక్కును వారి కుటుంబ సభ్యునికి అందజేశారు. ఈ సందర్భంగా భాధిత కుటుంబీకులు ఆపదలో ఆర్థికంగా ఆదుకొన్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బషీరాబాద్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం..

మాజీ రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి చొరవతో రూ.1.50 లక్షలతో లైటింగ్ సౌకర్యం.



కమ్మర్ పల్లి, బతుకమ్మ :మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీ కేఆర్ సురేష్ రెడ్డి చొరవతో మండలంలోని బషీరాబాద్ గ్రామంలో వివేకానంద చౌరస్తాలో రూ.1.50 లక్షల వ్యయంతో హైమాస్ట్ లైట్లను శనివారం రోజున ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వాహనదారులు స్పందిస్తూ తమ గ్రామంలో అవసరమైన చోట లైటింగ్ సౌకర్యం కల్పించిన మాజీ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఆయన చొరవతో గ్రామానికి ఉపయోగకరమైన సదుపాయం అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ లైటింగ్ ఏర్పాటు చేయడంతో రాత్రి వేళలో వెలుతురు ప్రజలకు రక్షణ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రమంలో బషీరాబాద్, చౌట్‌పల్లి సర్పంచులు జమున మహేష్, మహబూబ్, ఉపసర్పంచ్ భూమేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు గంగారెడ్డి, ఎలాల లింగారెడ్డి, నర్రా మోహన్, పోలీస్ సాగర్, బందెల రాజు, రమేష్, భాశెట్టి, నడిమోళ్ల రాజు, శేఖర్, డాక్టర్ నర్సయ్య, వంకాయల ఆనంద్, ప్రశాంత్, హుస్సేన్, దేవేందర్, గంగాధర్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ జీవనయ్యకు ఘన వీడ్కోలు





బతుకమ్మ: బిచ్కుంద:కామారెడ్డి జిల్లా బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఎంతో అంకితభావంతో, నిజాయితీతో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ బండేల జీవనయ్యశనివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.బిచ్కుంద స్టేషన్‌లో తన సర్వీసు కాలంలో శాంతి భద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో, ప్రజలకు పోలీసులకు మధ్య వారధిగా నిలుస్తూ విశేష సేవలందించిన జీవనయ్య బదిలీపై వేరొక పోలీస్ స్టేషన్‌కు వెళు న్న నేపథ్యంలో ఈ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) రవికుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) గుండెల రాజు హాజరై కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. ముందుగా సీఐ, మరియు ఎస్ఐ జీవనయ్య ని పూలమాలతో, పట్టు శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ... "బండేల జీవనయ్య పోలీస్ శాఖలో ఒక క్రమశిక్షణ కలిగిన అధికారి. తనకు అప్పగించిన ఏ కేసునైనా, ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో పూర్తి చేసేవారు. సీనియర్ అధికారుల పట్ల గౌరవం, జూనియర్ సిబ్బంది పట్ల ఆప్యాయత, సామాన్య ప్రజల పట్ల స్నేహపూర్వక వైఖరి ఆయన సొంతం. ఇలాంటి అధికారి బదిలీ కావడం మా స్టేషన్ కు కొంత లోటే అయినా, ఆయన ఉన్నతికి ఇది మెట్టు" అని కొనియాడారు.ఎస్ఐ గుండెల రాజు మాట్లాడుతూ, జీవనయ్య విధుల్లో చూపిన చొరవ, రాత్రింబవళ్లు శ్రమించిన తీరును ప్రత్యేకంగా ప్రశంసించారు.అనంతరం సహచర సిబ్బంది, జీవనయ్య తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. బిచ్కుంద స్టేషన్ పరిధిలో ఏలాంటి సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేవారని, ఆయన నవ్యతూ పలకరించే తీరును మరువలేమని పేర్కొన్నారు.తన వీడ్కోలు సందర్భంగా భావోద్వేగానికి గురైన బండేల జీవనయ్య మాట్లాడుతూ, "బిచ్కుందలో పనిచేసిన కాలం నా సర్వీసులో మరువలేని అధ్యాయం. ఇక్కడి అధికారులు నాకు ఇచ్చిన ప్రోత్సాహం, సిబ్బంది చూపిన ప్రేమ, ప్రజలు ఇచ్చిన గౌరవం నా జీవితాంతం గుర్తుండిపోతుంది. ఎక్కడ ఉన్నా పోలీస్ శాఖ గౌరవాన్ని నిలబెడతాను" అని తెలిపారు.చివరగా స్టేషన్ సిబ్బంది తరపున జీవనయ్య నూతనంగా బాధ్యతలు స్వీకరించ బోతున్న స్టేషన్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నిండు నూరేళ్లు ఆయురా రోగ్యాలతో, కుటుంబంతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలిపారు.బదిలీతో పని చేసే ప్రదేశం మారవచ్చు... కానీ కలిసి పనిచేసిన జ్ఞాపకాలు, సంపాదించుకున్న గౌరవం, ఏర్పడిన ఆత్మీయ అనుబంధాలు ఎప్పటికీ చెరిగిపోవు. అని సహచర సిబ్బంది తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు

పోలీస్ అమరవీరుల వారోత్సవాల ముగింపు

– బిచ్కుందలో ఘనంగా క్యాండిల్ ర్యాలీ

బతుకమ్మ:బిచ్కుంద.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా డిజీపీ ఆదేశాల మేరకు బిచ్కుంద పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 21 నుండి 31 వరకు జరుగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా చివరి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ క్యాండిల్ ర్యాలీలో పోలీస్ సిబ్బంది చేతిలో కొవ్వొత్తులను పట్టుకొని, దేశ రక్షణ కోసం, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... "శాంతి భద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది. వారి త్యాగాలు చిరస్మరణీయం. వారు చూపిన తెగువ, నిబద్ధత నేటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకం. ప్రతి పోలీసు అమరుడి కుటుంబాన్ని ఆదుకోవడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.అనంతరం అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళు లర్పించారు. అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం – వారి సేవలు మనందరికీ స్ఫూర్తిదాయకంఈ క్యాండిల్ ర్యాలీలో బిచ్కుంద సీఐ, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.



మాదిగల ఐక్యతను చాటుదాం

నవంబరు 1న నిజామాబాద్‌లో ఆది జాంబవంతుని శోభాయాత్ర

మాదిగ జాగృతి సంఘం మండల నాయకుడు

పాలేపు రాము మహారాజ్ పిలుపు

మోర్తాడ్ బతుకమ్మ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నవంబరు 1వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న 'మాదిగ మహారాజుల ఆది జాంబవంతుని శోభాయాత్ర'ను విజయవంతం చేయాలని మాదిగ జాగృతి సంఘం మోర్తాడ్ మండల నాయకుడు పాలేపు రాము మహారాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.ఆది జాంబవంతుడు మాదిగ సమాజ చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని, సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా జిల్లాలోని అన్ని మండలాల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శోభాయాత్రకు ఘనత తీసుకురావాలని కోరారు. పార్టీలు, మతాలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా మాదిగ సమాజం అంతా ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భేదాలను పక్కనపెట్టి ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. శోభాయాత్రలో యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ సంఘాల



నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పాలేపు రాము మహారాజ్ విజ్ఞప్తి చేశారు

పెద్ద ఎక్లారాలో పంచాయతీ రికార్డుల పరిశీలన

బతుకమ్మ మద్నూర్, అక్టోబర్ 31:కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల పరిధిలోని పెద్దఎక్లారా గ్రామాన్ని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) సత్యనారాయణ రెడ్డి శనివారం సందర్శించారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతోమాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, పంచాయతీకి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట రామ్ రెడ్డి, కారోబార్ తులసిరామ్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ పర్యటన..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సర్ పైన జరుగుతున్న దుష్ప్ర చారానికి సంబంధించి గ్రామ ప్రజలను కలిసి వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పా టుకు సంబంధించి స్థల పరిశీలన చేపట్టారు. విగ్రహ ఏర్పాటుకు అను వైన స్థలాన్ని పరిశీలించి స్థానికులతో చర్చించారు. అలాగే వారం రోజుల క్రితం మరణించిన బీజేపీ కార్యకర్త మంత్రి లింగం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లి సాయి ప్రసాద్, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన మండల కాంగ్రెస్ నేతలు..



రుద్రూర్, బతుకమ్మ : అఖిల భారత కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 1 న రాంలీల మైదానంలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ డీసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రుద్రూర్ మండల కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టారు. ఢిల్లీ బయలుదేరిన వారిలో మాజీ విండో చైర్మన్ పత్తి రాము, పార్వతి ప్రవీణ్, మాశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గుమ్మిర్యాల మాజీ ఎంపీటీసీ ముక్కెర గంగ భూమన్న మృతి

శోక సముద్రంలో కుటుంబ సభ్యులు



ఏర్గట్ల, బతుకమ్మ:మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తెలంగాణ ఉద్యమకారుడు ముక్కెర గంగభూమన్న మరణించాడు.ఇట్టి సందర్భంలో కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ముక్కెర గంగ భూమన్న కు ఆరోగ్యం బాగాలేనందున నిజామాబాద్ హాస్పిటల్ కు తీసుకపోవడం జరిగిందని,నిజామాబాదులో డాక్టర్లు నీమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ తీసుకుపోవాలని తెలపడంతో హైదరాబాద్ నీమ్స్ హాస్పిటల్ కు తీసుకపోవడం జరిగింది.నీమ్స్ హాస్పిటల్లో శనివారం రోజున మరణించడంతో ఆయన అంత్యక్రియలు ఆదివారం రోజు ఎనిమిది గంటలకు జరపడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ

రంగారెడ్డి, బతుకమ్మ : హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో విద్యార్థుల పార్టీ తీవ్ర కలకలం రేపింది. కమ్మెట గ్రామ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పార్టీపై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేశారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మెట గ్రామ శివారులో ఉన్న ఎల్జీ ఫామ్‌హౌస్‌లో శుక్రవారం ఈ పార్టీ నిర్వహించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రధాన నిర్వాహకుడు మన్నన్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా ఫ్రెండ్స్, ఫాలోవర్లకు ఈ డ్రగ్స్ పార్టీ గురించి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ జరిగే ప్రదేశం వివరాలను ముందుగానే వెల్లడించకుండా రహస్యంగా ఉంచినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనతో విద్యార్థుల మధ్య మత్తు పదార్థాల వినియోగంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.ఈ పార్టీలో సుమారు 108 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. వారందరికీ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. అందులో ముగ్గురికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు వెల్లడించారు. పార్టీ నిర్వహించిన ప్రధాన నిర్వాహకుడు మన్నన్‌తో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇక ఈ పార్టీకి హాజరయ్యే వారి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఎంట్రీ ఫీజు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు చెల్లించిన వారికి చివరి నిమిషంలో ఫామ్‌హౌస్ లొకేషన్ పంపించి అక్కడికి రప్పించినట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ నిర్వహించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ పార్టీలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.వీరిలో



శంకరపల్లి మండలం దొంతన్‌పల్లిలోని ఐబీఎస్ ఇఫ్లూయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు అధికంగా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పార్టీ ప్రధాన నిర్వాహకుడు మన్నన్ గతంలో అదే విద్యాసంస్థలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించిన సమయంలో విద్యార్థులతో పరిచయం పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఆ పరిచయాల ఆధారంగా వారిని పార్టీకి ఆహ్వానించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ పార్టీలో పలువురు యువతులు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్ఓటీ, చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా



దాడులు చేపట్టారు. పోలీసులను చూసి కొందరు విద్యార్థులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో ప్రధాన నిర్వాహకుడు మన్నన్‌తో పాటు మరో ఇద్దరికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఈ పార్టీకి గంజాయి ఎలా చేరింది.. ఎవరు సరఫరా చేశారు.. విద్యార్థులకు మత్తు పదార్థాలు అందించడంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో భారీగా మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.ఈ పార్టీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఎవరు చేశారనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎంట్రీ ఫీజు రూపంలో వసూలు చేసిన డబ్బులు ఎవరికి చేరాయి.. ఫామ్‌హౌస్‌లో ఇలాంటి కార్యక్రమాలు గతంలోనూ జరిగాయా అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఫామ్‌హౌస్ యజమాని పాత్ర, పార్టీ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా అనే వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు ఫామ్‌హౌస్‌లపై పోలీసులు తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో తాజాగా చేవెళ్లలో వెలుగుచూసిన ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కేసు విచారణ పూర్తయితే ఈ పార్టీ వెనుక ఉన్న మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఒకపక్క తెలంగాణ ప్రభుత్వం.. మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి మరీ రాష్ట్రవ్యాప్తంగా దాడులు చేస్తున్న వేళ.. ఇలాంటి భారీ డ్రగ్స్ పార్టీ జరగడం తీవ్ర దుమారం రేపుతోంది.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు



ఎంపీడీఓ సంతోష్ కుమార్

భీమ్ గల్, బతుకమ్మ :ఇండ్లల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు ఎత్తిపోకుండా ఉంటాయని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని జగిర్యాల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటింటికి ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పీట్లు, డ్రైనేజ్ అండ్ పాయింట్ సోక్ పిట్ల పనులను ఆయన పరిశీలించారు. భూగర్భ జలాలను పెంచే ప్రక్రియలో భాగంగా నవంబర్ మాసంలోపు 100 ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్ బీ ఎం కింద నిర్మిస్తున్న డ్రైనేజ్ లాస్ట్



పాయింట్ లో ఇంకుడు గుంతలను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. అనంతరం గ్రామంలోని జడ్పిహెచ్ ఎస్ స్కూల్ ను సందర్శించారు. స్కూల్ లో మౌలిక సదుపాయలను, టాయిలెట్ ల నిర్మాణం పనులను పరిశీలించిన ఎంపీడీఓ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సీస్సీ విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ సిలబస్ ప్రకారం పాఠాలను ఎప్పడికప్పుడు చదువుకొని, పరీక్షల్లో 600 లకు 600 మార్కులు సంపాదించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడాల ప్రసాద్, ఏపీఓ నర్సయ్య, జిపి సెక్రెటరీ భూమేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ వినియోగంపై కన్నతల్లి చేతిలో బిడ్డ హతం

ఆత్మహత్యగా నమ్మించేందుకు అడిన నాటకం

పోస్ట్ మార్టం రిపోర్ట్ తో బహిర్గతం

తల్లిని అరెస్ట్ చేసిన పోలిసులు



రంగారెడ్డి, బతుకమ్మ:రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన 14 ఏళ్ల బాలిక అనుమానాస్పద మృతి కేసులో దారుణ నిజం వెలుగులోకి వచ్చింది. కూతురు ఆత్మహత్య చేసుకుందంటూ తల్లి అల్లిన కల్పిత కథను పోస్టుమార్టం నివేదిక పటాపంచలు చేయగా, కన్నతల్లే గొంతు నులిమి చంపినట్లు పోలీసులు ఆధారాలతో సహా నిరూపించారు. . షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష రాఘవేంద్ర, ఏసీపీ పి. లక్ష్మీనారాయణల పర్యవేక్షణలో కొత్తూరు పోలీసులు ఈ కేసు మిస్టరీని ఛేదించారు. శనివారం విలేకరుల సమావేశంలో డిసీపి తెలిపిన వివరాల ప్రకారం...కొత్తూరు హనుమాన్ టెంపుల్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ముయ్యాది రాజు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె సువర్చల అలియాస్ లల్లీ (14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సువర్చల నిరంతరం మొబైల్ ఫోన్ వాడటం, చదువుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్ల తల్లి విజయలక్ష్మితో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఫోన్ వాడకం విషయమై తల్లీకూతుళ్ల మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో విపరీతమైన ఆగ్రహానికి లోనైన విజయలక్ష్మి, కుమార్తెను అల్మారాకు అదిమిపట్టి రెండు చేతులతో గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. హత్య అనంతరం నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి విజయలక్ష్మి డ్రామా ఆడింది. కుమార్తె మెడకు చీరను బిగించి ఉరివేసుకున్నట్లుగా అమర్చి, ఏమీ తెలియనట్లు బయటకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి వచ్చింది. అనంతరం ఇంటికి వచ్చి కూతురు ఆత్మహత్య చేసుకుందంటూ కేకలు వేసి నాటకమాడింది. మొదట ఈ ఘటనపై కొత్తూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్యులు అందించిన పోస్టుమార్టం నివేదికలో బాలిక గొంతు నులిమివేయడం వల్లే చనిపోయిందని, ఉరివేసిన ఆనవాళ్లు బలవంతంగా సృష్టించినట్లు స్పష్టమైంది. దీంతో పోలీసులు కేసును హత్య కేసుగా మార్చారు.తల్లి విజయలక్ష్మిని తమదైన శైలిలో విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది. పోలీసులు ఘటనా స్థలం నుంచి చీర, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని, నిందితురాలిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు

పోలియో గురించి తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు ఇవే..

వెబ్ డెస్క్ , బతుకమ్మ:ప్రతి ఏడాది అక్టోబర్ నెలలో ప్రపంచ పోలియో దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పోలియో వ్యాధి నిర్మూలనలో టీకాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. ఈ ఏడాది ఇతివృత్తం ఒక రోజు.. ఒకే లక్ష్యం.. పోలియో నిర్మూలన. పోలియో వైరస్ సోకడం వల్ల పిల్లల్లో శాశ్వత పక్షవాతం ఏర్పడ టంతోపాటు, తీవ్రమైన సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధికి ప్రత్యేక చికిత్స లేదు. టీకాలు వేయించుకోవడం ద్వారానే పిల్లలను పోలియో నుంచి రక్షించుకోవచ్చు. భారత్‌లో 2011 నుంచి సహజ పోలియో వైరస్ కేసులు నమోదు కాలేదు. అయినప్పటికీ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో వైరస్ ఇంకా వ్యాప్తిలో ఉండడంతో, పిల్లలకు టీకాలు వేయించడం కొనసాగించడం అత్యంత అవసరం.

రెండు రకాలుగా టీకా..

పోలియో నివారణకు ఇంజెక్షన్ ద్వారా ఇచ్చే ఐపీవీ, నోటిద్వారా చుక్కల రూపంలో ఇచ్చే ఓపీవీ టీకాలు ఉపయోగిస్తారు. ఐపీవీ శరీరంలో ప్రతిరక్షకాలను అభివృద్ధి చేసి, పోలియో వల్ల వచ్చే పక్షవాతం నుంచి రక్షణ కల్పిస్తుంది. ఓపీవీ పేగుల్లో రోగనిరోధక శక్తిని పెంచి, వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ రెండు టీకాలు వేర్వేరు విధాలుగా రక్షణ కల్పిస్తాయి. అందువల్ల ఒక టీకా వేయించుకున్నంత మాత్రాన మరొకటి అవసరం లేదని భావించకూడదు. జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం పిల్లలకు రెండింటినీ వేయించాలి. పల్స్ పోలియో కార్యక్రమాల సమయంలో కూడా అర్హులైన పిల్లలకు అదనపు ఓపీవీ చుక్కలు వేయించాలి.

ఏయే వయస్సులో వేయించాలి..

భారత జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం పుట్టిన వెంటనే, ఆరు, పది, పద్నాలుగు వారాల వయసులో ఓపీవీ చుక్కలు ఇస్తారు. అలాగే 16 నుంచి 24 నెలల మధ్య బూస్టర్ డోసు వేస్తారు. ఐపీవీ టీకాను ఆరు, పద్నాలుగు వారాల సమయంలో నిర్ణీత పద్ధతిలో ఇస్తారు. తల్లిదండ్రులు పిల్లల టీకాల వివరాలను భద్రపరచుకోవాలి. ఏదైనా డోసు మిస్ అయితే వైద్యులను సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోవాలి. టీకాలు వేసినప్పటికీ వంద శాతం రక్షణ ఉంటుందని చెప్పలేం. అయితే సూచించిన అన్ని డోసులు పూర్తిచేయడం వల్ల పోలియో పక్షవాతం నుంచి బలమైన రక్షణ లభిస్తుంది. టీకాల మధ్య విరామాలు ఏర్పడడం, సమాజంలో తక్కువ మంది మాత్రమే టీకాలు వేయించుకోవడం వల్ల పిల్లలకు ముప్పు పెరిగే అవకాశం ఉంటుంది.